

# తూకం బతుకు

సి. సుజాత

ఆఫీస్ వదిలేసరికి వర్షం దారుణంగా కురుస్తోంది. బస్ వెళ్లిపోతుందేమోనని దిగులుపడుతూ కాంటీన్‌లో నిలబడి టీ తాగుతుంటే సుందరం ఆ ప్రపోజల్ బయట పెట్టాడు. రక్తం మొహంలోకి వేగంగా పరుగుతీసినట్లయింది తప్ప ఇంకేం అనిపించ లేదు.

''నీకు ఇష్టమే కదా?''

ఆత్రంగా రెట్టించాడతను. ఏమంటాను. ఇష్టమే నన్నట్లు తల ఊపి ఊరుకొన్నాను. అతని మొహంలోకి నవ్వు తెరలొచ్చాయి. జుట్టులోంచి కారుతున్న నీళ్లు కర్చీఫ్‌తో తుడుచుకుంటూ, ''అచ్ఛా! మళ్లీ కలుద్దాం!'' అనేసి ఆ వర్షంలోనే చేతులూపుకొంటూ నడిచి వెళ్లిపోయాడు. నేనలాగే నిలబడ్డాను.

'నువ్వెలా వెళతావని,' మాటవరసకైనా అన కుండా అలా హడావుడిగా వెళ్లిపోయినందుకు ముందుగా చిరాకొచ్చింది. ఏం చేస్తాను? అతని సంగతి తెలిసీ కోపం తెచ్చుకోవడం దండగ. కాసేపు సుందరం గురించి ప్రేమగా, పొయిటిక్‌గా, రొమాంటిక్‌గా ఊహించి ఆనందించాలనిపించింది.

ధారలుగా కురుస్తున్న వర్షం... ఎవ్వరూ లేని ఏకాంతం... అప్పుడు సుందరం రావడంతో నా ఆలో చనకు హఠాత్తుగా ఫుల్‌స్టాప్ పడింది. ఎవరూ లేని ఏకాంతం ఎక్కడుంది? ఊహలకు అవకాశం ఎప్పు డుంది? కాంటీన్‌లో వంటాయన అక్కడ పనిచేసే కుర్రాడి మీద స్టీరియోఫొనిక్ సౌండ్‌లో అరుస్తున్నాడు.

''గ్లాసుల కోసం వర్షంలో చచ్చినా వెళ్లను,'' అంటాడు కుర్రాడు.

''వెళ్లకపోతే ఇక్కడే చచ్చేలా తంతాను,'' అంటాడు వంటాయన.

ఈ నేపథ్యంలోంచే సుందరం ప్రపోజల్ నా చెవిన పడింది. పోనీ వేడివేడి టీ తాగుతూ కమ్మని సన్నివేశం ఊహించుకొందామనుకొంటే ఊహు... దృష్టి మాటిమాటికీ మురిగ్గా ఉన్న కాంటీన్, ఇటువైపు సింక్‌లో ఉన్న ఎంగిలి గ్లాసులవైపే... లాభంలేదు. నాకు కవితాత్మ లేదని తేలిపోయింది.

పోనీ కథలూ, సినిమాల్లోలాగా సన్నటి వెండి మువ్వలు కనిపించేలా వర్షంనీళ్లలో కాళ్లు తడుపు కొంటూ కలల్లో తేలిపోతూ వర్షంలో నడిచి వెళ్లిపోనా! అనిపించింది. ఉదయాన్నే కట్టుకొన్న ఇస్త్రీ చీరె తడిసి పాడైపోతుంది. దిక్కుమాలిన ఇస్త్రీలకే బోలెడు డబ్బయి పోతోంది. ఒక్క నిట్టూర్పుతో యాక్షన్ పార్టుకి ఫుల్‌స్టాప్ పెట్టి ప్రస్తుతంలోకి వస్తే ఎదురుగ్గా అన్నీ సమస్యలే.

''వచ్చే నెలలో మనం మన ఇంటికి వెళదాం విజయా,'' అన్నాడు సుందరం.

నయం! నన్ను పెళ్లాడతావా అని చచ్చుగా అడక్కుండా బానే అడిగాడు. ఏం వెళ్లటం? ఎక్కడో ప్రపంచం అవతల రూమ్‌లో ఉంటున్నాడు సుందరం. ఆ రూమ్‌లో అతనితో పాటు మరో ఇద్దరు శతమర్కట సమానులు. అక్కడ లాభంలేదు. ఇకపోతే కొత్త ఇల్లు వెతుక్కోవాలి. అదీ ఆఫీస్ దగ్గరైతేనే బావుంటుంది. ఇది మరీ పోష్ లొకాలిటీ. బోలెడు అద్దెలు. ముందుగానే ఉంటున్న వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ ఖాళీ చేయాలి. ఇప్పటివరకూ అటు అమ్మో, ఇటు హాస్టల్లో వంటా

యనో వండి పెడితే తినటం తప్ప సొంతంగా వండు కోవటం రాదు. ఇక సుందరాన్ని పెళ్లాడితే పొద్దున్నే లేచి వంటొండు కొని, తిని, సర్దుకొని... మళ్లీ ఆలోచనలు ఎటో వెళ్లిపోతున్నాయి. హాయిగా సుందరంతో పెళ్లి జరగబోతుంటే, ఈ వెధవ వంటావార్పూ ఊహలేమిటో... ఛీ... ఛీ... ఇవేనా మధురో హలంటే? చక్కగా అతనూ నేనూ పూవుల్లో పూవులై...

అన్నట్లు సాయంత్రందాకా ఆఫీస్ పనిలో మునిగీ తేలీ... అటుపైన షికార్లు, కబుర్లకి ఓపికుంటుందా? సందేహమే! ఓ క్షణం నా మీద నాకే కోపం వచ్చింది. మూడేళ్లబట్టీ వెంటాడుతున్న ఆలోచననీ, స్నేహాన్నీ ఇవ్వాళ సుందరం మాటల్లోకి మార్చి చెపితే... ఆ ఆనందాన్ని ఊహల్లోకి మార్చగలిగానా!

సుందరం ఆ విషయం నాతో ఎలా చెప్పేడో గుర్తొచ్చి ఆపుకోలేని నవ్వు ముంచుకొచ్చింది. నెర్వస్‌గా చేతులు వణుకుతుంటే అతను నావైపు చూసిన తీరు, ఎప్పుడూ దబాయిస్తున్నట్టుండే మాట వైఖరీ మారిపోయి లోగొంతులో నన్ను పిలిచిన వైనం గుర్తొచ్చి మరీ మరీ నవ్వొచ్చింది. ఇక ఆలోచనలు అక్కడే ఆపేసి, మెరుస్తున్న వర్షం చినుకుల్నీ, చినుకు రాలిపడగానే వణుకుతున్న మెత్తని ఆకులనీ, ఆకుల మీంచి కిందకి రాలిపడుతున్న నీటిచుక్కల్నీ చూస్తూ నిలబడితే మళ్లీ ముల్లులా, మనసులో అదే బెంగ!

'నాకు రసహృదయం లేదా? ప్రేమానుభూతి నాలో కలగనేలేదా? ఈ అనుభవం ఇంత చప్పగా ఉంటుందా?'

ఒక్కటి మాత్రం చెప్పగలను. పెళ్లిని గురించిన తియ్యని ఊహలకంటే ఉదయాన్నే లేవడాలు, వంటావార్పూ చాకిరీలే నా మనసులోకి ఎక్కువగా వచ్చి నన్ను దడిపించాయి.

*

నెలరోజులు తొందరగానే గడిచాయి. ఇల్లు వెతుక్కోవటం. ఇటు అమ్మావాళ్లు, అటు సుందరం అమ్మా నాన్నా అందరూ రావటం ఆనందించటం, అందరూ కలిసి సుఖంగా భోజనం చేశారు కూడా.

'ఈ టౌన్‌లో వీళ్లిద్దరి సంపాదన ఇంటద్దెకూ, బొటాబొటిగా భోజనానికి సరిపోతాయేమో,'ని లెక్క లేసుకోవడాలూ, ఇవన్నీ వింటూ నేను మరింత అయోమయంలో పడిపోవటమే సరిపోయింది. రిజిస్టరాఫీసు నుంచి బయటికొచ్చాక, ఎవరి దారిన వాళ్లు వెళ్లిపోయాక ఫ్రెండ్స్ మోసుకొచ్చిన అభినందన పరంపరల్లో మేం నిలువెల్లా తడిసి ముద్దయ్యాక ఎప్పటికో అందరూ ముచ్చట్లు ఆపి తరలి వెళ్లాక అప్పుడు నేనూ, సుందరం కొత్త ఇంట్లో వంటరిగా మిగిలాం. సుందరం వణుక్కుంటూ, 'ఎలా ఉంది విజయా,' అని అడిగేడు. గది చుట్టూ చేతులూపుకుంటూ పరుగెత్తి, 'చాలా బావుంది హాపీగా ఉంది,' అని చెప్పాలన్నంత ఉత్సాహం వచ్చింది. అయితే అడ్డదిడ్డంగా అన్నీ ప్యాకేజీలే. సుందరం రూంలోంచి తెచ్చిన బక్కెట్లు, చాపలు, దిండ్లూ, నా హాస్టల్ గది ఖాళీచేసి తెచ్చిన అట్టపెట్టలూ, ఇద్దరం కలిసి కొనుక్కొచ్చిన గిన్నెలూ, డబ్బాలూ గదంతా చిందవందరగా సామాన్లు, గదిలో పరుగెత్తాలన్న కోరిక అణిచేసి, "ఇవన్నీ సర్దాలా," అన్నా నీరసంగా. సుందరం మళ్లీ కంగారుగా మొహం తుడుచుకొని, "వద్దొద్దు! అలాగే ఉండనీ. తరవాత చూద్దాం... ఆనక చూద్దాం," అన్నాడు అర్థంపర్థం లేకుండా.

బుల్లి కిచెన్, ఒకే చిన్నగది, ఆనక చూసేందుకు ఎలా కుదురుతుందీ. ఇద్దరం పళ్లు బిగించి ఎటు సామాన్లు అటు గోడకి చేరేసి చచ్చినట్లు ఇల్లు చిమ్ముకొని సెటిలౌదామని అనుకొంటుంటే గుర్తొచ్చింది ఇంట్లో ఫాన్లు బిగించలేదని, లైట్లు లేవని... పేకేజీ పెట్టెల్లోంచి ఊడదీసిన ఫానుముక్కలు ఉండిపోయాయని తెలాక తిట్టుకొంటూ అవన్నీ బయటపడేసి ఆ చీకట్లోనే ఎలక్ట్రీషియన్ కోసం పోయి ఎలాగైతేనేం ఫాన్లు, లైట్లు సాధించేం. ఇంకా నయం. మధ్యలో ఆకలేసి తిండి సంగతి గుర్తొచ్చింది. మస్తుగా టిఫిన్ పాకెట్లు తెచ్చుకొన్నాం. ఆవులింతలొచ్చేదాకా మా కాంటీన్ టిఫిన్‌కి ఈ హోటల్ టిఫిన్‌కి తేడా గురించి, బడ్జెట్ గురించి చెప్పుకున్నాం. జీవితం అటు తరువాత వేగంగా పరుగులు తీసింది. ఎందుకు తీయదులెద్దూ! రాత్రిళ్లు చాలాసేపు మేలుకోవటం, ఉదయాన్నే లేవలేకపోవడం, వంట మాట అటుంచి కనీసం కాఫీ పెట్టుకోవటానికి తీరిక లేకుండా ఆఫీసుకి పరుగు తీయటం, కాలం పరుగెత్తమంటే పరుగెత్తదూ?

చెప్పా పెట్టకుండా ఏ ఫ్రెండో దిగబడేవాడు. ఇద్దరం పోటీలుపడి వాళ్లతో కబుర్లు చెప్పేవాళ్లం. టీలు పెట్టే విషయంలోనూ, ఎంగిలికప్పు కడిగే విషయంలోనూ, ఎన్నోసార్లు విడాకులవరకు తగవులు ముదిరేవి. కనిపించిన ప్రతి పుస్తకం అద్భుతం అని కొనేసుకొని, పచ్చడితో నెట్టుకొచ్చిన రోజులెన్నో వున్నాయి.

ఈ తగవులు, రాజీల మధ్యనే ఓరోజు నాకు సుస్తీ చేసింది. కళ్లు తిరిగి నీరసంతో కూలబడితే సుందరం

కంగారుపడిపోయాడు. సరే... ఇద్దరం ఆస్పత్రికి పరుగెత్తాం. అక్కడ సుందరం ఏడుపు మొహం చూసి డాక్టర్ బోలెడంత ఆనందించి, 'ఇదేం జబ్బు కాదు బాబూ, పత్యంగిత్యం ఏం అక్కర్లేదు. విజయ చక్కని పాపాయిని కంటుందయ్యా,' అని చెప్పాక సుందరం మొహం వెలిగిపోయింది. ఇద్దరం బస్‌స్టాప్‌లో నిలబడ్డాం. వేగంగా కిటికిటలాడుతూ వెళ్లే బస్‌లను చూసి, "పోనీ ఆటోలో వెళదామా?" అన్నాడు సుందరం.

ఇంకా మూడు రోజులకుగానీ రాని జీతాల్ని ఇద్దరం ఒకేసారి తల్చుకున్నాం.

''నీకేం అన్పిస్తోంది విజయా?'' అన్నాడు సుందరం నా మొహంలోకి అపురూపంగా చూసి.

నేనేం చెప్పను. అప్పటికే కళ్లు నిండిపోయి, వీధి అలుక్కుపోయినట్లు కనిపిస్తోంది. ఉదయాన్నే వాంతులు మొదలైతే నీరసంతో ఆఫీస్ పని ఎలాగా? జీతం నష్టం మీద సెలవులు పెడితే ఎలా తట్టుకొంటాం. ఇది నా మనసులో కదిలిన ఆలోచన. మొట్టమొదటిసారి తల్లిని కాబోతున్నానని తెలిసిన క్షణం నన్ను కదిపేసిన ఆవేదన, రాబోయే పాపాయికోసం కొత్త ఊహలు ఇవేనా?

అబ్బ జీవితం ఇంత చేదుగా ఎలా ఉందబ్బా! ఈ మాటే సుందరంతో అంటే, "అందుకే, కడుపుతోవున్న వాళ్లంతా పులుపు తినాలని కోరుకునేది," అని వెధవ జోకు వేశాడు.

ఇంక కాలం బహు భారంగా నడిచిందంటే నమ్మండి. ఆఫీస్ పనితోనే నేను అలసిపోతే సుందరం ఇంటిపని, నా ఆపసోపాలు- అన్నీ భరిస్తూ ఎలాగైతేం నెట్టుకొచ్చాం! పాప పొజిషన్ ఎలా వుందో, ఆరోగ్యంగా ఉందో లేదోనని స్కానింగ్ తప్పదన్నారు డాక్టర్.

ముందుగానే పుట్టేది అమ్మాయని తెలిసీ, ఏ వేళకు పుడుతుందో, గంటలతో సహా లెక్కలు తెలిసీ ఇంక ఎదురుచూసేది ఏముందీ? రంగు రంగుల ఊహలు, ఆలోచనలు ఏవీ లేకుండానే చాలా సాదా సీదాగా రొటీన్‌గా రోజులు పరుగెత్తాయి. ఇక రెండు రోజుల్లో మెటర్నిటీ లీవ్ పెడదామనుకొంటూ ఉండగానే నా వీక్లీ ఆఫ్, పండుగ సెలవు కలిసి వచ్చాయి. ఒక వర్కింగ్ డే ఉంటే తప్ప ఆ రెండు లీవ్‌లు సెలవు కిందకి వస్తాయని సందేహం వచ్చింది. ఉదయం నుంచి నలతగా ఉన్నా ఇవ్వాళ పురుడొస్తుందేమోనని డాక్టర్ చెప్పినా, ఆ రెండు సెలవులూ దక్కించుకోవడం కోసం మూలుక్కుంటూ ఆఫీస్‌కు వెళ్లి, నవ్వు మొహాన పులుముకొని రిజిస్టర్‌లో సంతకం చేసి, పెదవులు బిగబట్టి ఆఫీస్‌లో పనిచేస్తుంటే దిగచెమటలు పోసేశాయి. కడుపులో కదలిక మొదలైంది. రెండు రోజుల సెలవుకోసం ఎంత యాతన తండ్రీ... ఎవరిని ఎలా పర్మిషన్ అడిగానో, ఏ భాషలో నా బాధ తెలియజేశానో తెలియదుగానీ ఆస్పత్రి చేరాను.

"నీకు జ్ఞానం ఉందా? ఇలా డెలివరీకి సిద్ధంగా ఉండి ఆఫీస్‌కు వెళతావా?" అంటూ డాక్టర్ ముక్కచివాట్లు పెడుతుంటే వింటూ పాపాయిని కన్నాను.

సుందరం, నేను కలిసి పాపాయి ముచ్చట్లు కాసేపు, ఆస్పత్రి బిల్లు, ఇతర ఖర్చులు కొత్తగా తేవాల్సిన సామాన్ల లిస్ట్ గురించి గంటల తరబడీ కబుర్లు చెప్పుకొన్నాం. సాయంగా ఉండేందుకు సుందరం అమ్మగారొచ్చారు. తను కొంతకాలం ఉండిపోతానన్నారు. పాపాయి బాధ్యత, ఇంటిపని బాధ్యత చాలామటుకు ఆవిడే తీసుకొన్నారు. లీవ్ ఇట్టే అయిపోయింది. ఆఫీస్ పని మళ్లీ మొదలు. రెండు గంటలకొకసారి పాపాయికి పాలు ఇవ్వాలని అనిపించేది. దాని బుల్లి బుల్లి చేతులు, ఆత్రంగా రొమ్ము అందుకొనే ఆ పెదవులూ గుర్తొచ్చి తల్లడిల్లిపోయేదాన్ని. సాయంకాలం అయ్యేసరికి నీరసం ముంచుకొచ్చేది. ఇంటికి వచ్చేసరికి అత్తయ్య వేడివేడిగా తినేందుకు ఏదయినా పెట్టేది. సుందరం, నేనూ చిన్న పిల్లల కంటే ఎక్కువగా అరుస్తూ, పాపాయితో ఆడేవాళ్లం.

తరువాత్తరువాత ఇందులో సరదా పోయింది. ఉన్నది ఒకే ఒక గది. అందులో నేను, పాపాయి, సుందరం, అత్తయ్య. తలుపులు తెరిస్తే నేరుగా వీధిలోకే దారి. సుందరం, నేనూ కనీసం ఐదు నిముషాలు కూడా ఏకాంతంగా ఉండేందుకు కుదిరేది కాదు. పాపం అత్తయ్య అన్నీ అర్థం చేసుకుంటారు. ఏం చేస్తాం?

ఆఫీస్ నుంచి ఇంటికి వస్తే, "జీవితం నిస్సారంగా ఉందోయ్ విజయా!" అని నిట్టూర్పులు వదిలేవాడు సుందరం.

నేనేమంటాను.. ఎంత వద్దనుకొన్నా, ఓదార్చుకున్నా సమస్య అదే. అత్తయ్య వెళ్లిపోతే పాపాయిని ఎవరు చూస్తారు? ఇరుకు కొంపలో ఎంతకాలం ఇలా బతుకుతాం. మామయ్య ఎన్నాళ్లు వండుకొని తిని ప్రైవేటు చెపుతాడు. జీవితం మాకెప్పుడూ ఓ ప్రశ్నార్థకాన్ని కళ్ల ముందు చూపిస్తూనే ఉంది.

''పోనీ పాపాయిని నేను తీసుకెళ్లిపోనా?'' అంది అత్తయ్య.

నేను ఉలిక్కిపడ్డాను. ఐదు నెలలకే నన్ను గుర్తు పట్టి నా మీదకు వాలిపోయే పాపాయిని, నా పాప వికాసాన్ని నేను చూడకుండా అత్తయ్యతో పాపని పంపేయడమా?

స్కూలు టీచర్ ఉద్యోగంలోంచి రిటైర్ అయి, ట్యూషన్లు చెప్పక తప్పని మామయ్య. శరీరం శిథిలమై, తనకు అందని గాలికోసం నరకయాతన పడే ఆస్మా పేషంట్ అమ్మ. చాలీచాలని నాన్న జీతంతో నిత్య దరిద్రంలో మా ఇల్లు. ఈ సమస్యలన్నింటినీ మించి నా ఇరుకు ఇల్లు. మా జీవితాల్లో అపురూపమైనదేమైనా ఉందీ అంటే అది నా పాప, రెండు సుందరంతో స్నేహం.

తూకం ప్రకారం, ఇచ్చిన జీతానికి కొలిచి మరీ ఉద్యోగం బరువు మోయిస్తే, వచ్చే కాసిన్ని రూపాయిలే మాకు ఆధారం. ఖరీదైందీ, డబ్బుతో వచ్చేదీ ఏదీ మాకు అందుబాటులో లేదు. పుట్టినప్పటి నుంచి అన్నింటికీ సర్దుకో అన్న నామమాత్రంతోనే బతికాం. నా పాపను నా దగ్గరే ఉంచుకోవడం ముఖ్యమా? సుందరానికీ నాకూ దొరికే ఏకాంతం ముఖ్యమా? అత్తయ్య పాపాయితో వెళ్ళిపోతే తగ్గిపోయే ఖర్చు సంగతే ముఖ్యమా? అని తలుచుకొంటే తట్టుకోలేనంత దుఃఖం ముంచుకొచ్చింది. సుందరాన్ని కన్నతల్లీ, నేను కన్నబిడ్డ ఇద్దరూ నా బతుక్కి భారమే. పొద్దుటే తనవీ, పాపాయివీ సామాన్లు సర్దుకొంది అత్తయ్య. నేను ఏడ్చాను.

“నీకెందుకూ పాపాయిని నేను శ్రద్ధగా చూస్తాగా. పల్లెటూర్లో ఇంత ఖర్చు ఉండదు,” అంది అత్తయ్య.

నేనే మాట్లాడలేదు. నా కన్నీళ్లూ ఆగలేదు. నేనెందుకు ఏడ్చానో నాకే తెలుసు. నేనూ, సుందరం పొద్దున్నే వెళ్లి ఆవిడను బస్ ఎక్కించాం. పాపాయి ఆవిడతో వెళ్లిపోతుంటే గుండెల్లో ఎక్కడో బలమైన కనపడని గాయం తగిలింది. ఇప్పుడు ఇల్లంతా ఖాళీగానే ఉంది. సుందరానికీ, నాకూ ఎక్కువైపోయినంత ఏకాంతం ఉంది. ఆఫీస్ నుంచి రాగానే సుందరం చాపమీద వెల్లకిలా పడుకొని కాసేపు దీర్ఘాలోచన అనంతరం-

“జీవితం శూన్యంగా ఉంది విజయా,” అన్నాడు.

నాకూ తెలుసు. ఆ శూన్యం ఏమిటో! ఎందుకో! అది పూడ్చుకొనే మార్గం మటుకే తెలియదు.

*విపుల మాసపత్రిక జూన్, 1994*

